అడపా పద్మ

"లక్ష్మీ, లక్ష్మీ" ఆందోళనగా అరుస్తూ వచ్చిన భర్తను చూసి "ఏమిటండీ?" అని ప్రశ్నించింది లక్ష్మి.

"అమ్మకి పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చిందట. నన్నే కలవరిస్తుందట. నాన్నగారు మా ఆఫీస్‌కి ఫోన్ చేసి చెప్పారు. త్వరగా బయలుదేరు" అంటూ లోపలకి వెళ్లాడు. పది నిమిషాలైనా లక్ష్మిలో కదలిక లేకపోవటంతో "ట్రైన్ మిస్ అవుతుంది. త్వరగా కానీయ్" అన్నాడు.

# మతమా? మానవత్వమా?

''సారీ అండి నేను రాలేను. మీరు వెళ్లిరండి. మిమ్మల్ని ఆపే హక్కు నాకు లేదు'' తలదించుకొని అంటున్న లక్ష్మివైపు కోపంగా చూసి ''ఆల్ రైట్ నీతో వాదించే టైం నాకు లేదు. నేను వెళుతున్నాను'' అంటూ ఏవో రెండు జతల బట్టలు బ్రీఫ్ కేసులో కుక్కుకొని బయటపడ్డాడు. తల్లి ఎలా ఉందో అనే ఆదుర్దా, కంగారు ఒకవైపు భార్య మనస్తత్వం ఏమిటో బోధపడక మరొకవైపు ఆలోచనలు అతడ్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మనసంతా చాలా చికాగ్గా ఉంది.

డేవిడ్, లక్ష్మి ఇద్దరూ డిగ్రీలో క్లాస్‌మేట్స్. మూడు సంవత్సరాల ప్రేమ ఇంట్లో చెప్పకుండా పారిపోయి పెళ్లిచేసుకునేంత దృఢంగా మారింది. ఫైనలియర్ ఎగ్జామ్స్ రాసే వరకు వారి ప్రేమ గురించి వాళ్ల క్లాస్‌మేట్స్‌కి కూడా తెలియనంత గోప్యంగా ఉంచారు.

చిత్తూరు జిల్లాలో మారుమూల పల్లెటూళ్ల ఇరువురివి. చెరొక పల్లెటూరి నుండి మధ్యలో ఉన్న టౌన్‌కి రోజూ బస్సులో వచ్చే వాళ్లు. వేర్వేరు స్టేజీలలో ఇద్దరూ ఒకే బస్సులో ఎక్కేవారు. అలా మొదలైంది వారి ప్రేమ.

డేవిడ్ తండ్రి పీటర్ చర్చిలో ఫాదర్ అయితే, లక్ష్మి తండ్రి జానకిరామయ్య ఎలిమెంటరీ స్కూల్ టీచర్. ఎగ్జామ్స్ రాశాక ఇద్దరూ వాళ్ల ప్రేమని ఇంట్లో తెలియజేశారు. సహజంగానే ఇరువురి ఇళ్లల్లో ఈ మతాంతర ప్రేమని, పెళ్లిని ఒప్పుకోలేదు.

ఇద్దరూ మేజర్లే కాబట్టి రాష్ట్ర రాజధానికి చెక్కేసి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. అయితే లక్ష్మి ఎలా ఉంటుంది? పీటర్ వాళ్లకు తెలియదు. డేవిడ్ ఎవరో? జానకిరామయ్య వాళ్లకు తెలియదు. హైదరాబాద్ వెళ్లి పెళ్లి చేసుకున్న సంగతి తెలుసుకున్న పెద్దవాళ్లు ముందు మండిపడి తరువాత వాళ్లు మేజర్లే కాబట్టి ఇంక వాళ్ల ఖర్మ అని వదిలేశారు. అప్పటి నుండి వాళ్లకి, వీళ్లకి ఏ విధమైన సంబంధబాంధవ్యాలు లేవు.

ఆ తరువాత ఎన్నో కష్టాలు పడి ఇద్దరూ చిన్న చిన్న ఉద్యోగాలు వెదుక్కున్నారు. వాళ్ల అదృష్టం బాగుండి కొంత కాలానికి డేవిడ్‌కి మంచి కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా జాబ్ రావటంతో లక్ష్మి జాబ్ మానేసి ఇంటి పట్టునే ఉండసాగింది.

వారి ఆనందానికి గుర్తుగా పండంటి బాబు పుట్టాడు. బాబుని పూర్తిగా తన అలవాట్లతో, తన పద్ధతిలోనే పెంచసాగింది లక్ష్మి. కానీ డేవిడ్ మాత్రం ఎటువంటి ఆంక్షలు విధించేవాడు కాదు. ఆమె కట్టు, బొట్టు, సాంప్రదాయం అన్నింటినీ గౌరవించేవాడు. లక్ష్మితోపాటు గుడికి వెళ్లేవాడు, చర్చికి వెళ్లేవాడు. మొదట్లో అతనితో కలిసి చర్చికి వెళ్లినా రానురాను అతని అలవాట్లు, పద్ధతులు లక్ష్మికి అనీజీగా అనిపించేవి. తను పెరిగిన వాతావరణమే కరెక్టు అనిపించేది.

అప్పటివరకు వీళ్ల గురించి పట్టించుకోని పెద్దవాళ్లను పూర్తిగా మర్చిపోతున్న తరుణంలో మొదటిసారిగా డేవిడ్ వాళ్ల చెల్లెలు ఎలిజబెత్ మ్యారేజ్ ఇన్విటేషన్ అందింది. ఆ పెళ్లికి వెళ్లాలని డేవిడ్, వద్దని లక్ష్మి ఇరువురూ మొదటిసారి గొడవ పడ్డారు.

లక్ష్మి చేసిన రాద్ధాంతానికి డేవిడ్ కూడా తన ప్రయత్నం విరమించుకున్నాడు. మళ్లీ రాకపోకలు మొదలయితే అతను తనకు కాకుండా పోతాడని లక్ష్మి భయం.

ఇది జరిగిన నాలుగు నెలల తరువాత మళ్లీ ఇప్పుడు తల్లికి అనారోగ్యం అంటూ కబురు వస్తే ఇప్పుడు కూడా రాను అంటున్న లక్ష్మిని ఎలా అర్థం చేసుకోవాలో అంతుపట్టడం లేదు డేవిడ్‌కి.

నాలుగు రోజుల తరువాత ఇంటికి వచ్చిన భర్తని చూసి రిలీఫ్‌గా ఫీలయింది లక్ష్మి. ''మీ అమ్మగారికి ఎలా ఉంది?'' ఎదురు వచ్చి చేతిలో బ్రీఫ్ కేస్ అందుకుంటూ అడిగింది.

''ఒక కాలు, చెయ్యి చచ్చుపడిపోయాయి. ఇంకా హాస్పిటల్‌లోనే ఉంది. డిస్చార్జి చేయలేదు'' చెపుతూ స్నానానికి వెళ్లాడు డేవిడ్.

అన్ని పనులు ముగించుకొని వచ్చి పడుకున్న భార్య చేతిగాజులు సవరిస్తూ- ''లక్ష్మీ! నాన్నగారు మన ఇద్దరిని అక్కడికి వచ్చేయమంటున్నారు.''

''దేనికి?'' అర్థం కానట్లు అడిగింది లక్ష్మి.

''అమ్మకి ఇలా అయిన దగ్గర నుండి ఆయన చాలా బాధపడుతున్నారు. ఇంటి కోడలిని ఉసురు పెడితే ఆ పాపం ఊరికే పోదు. అందుకే నేను చేసిన తప్పు సరిదిద్దుకోవాలనుకుంటున్నాను. మీరు మన ఇంటికి వచ్చేయండి అని అంటున్నారు. అమ్మకి ఇలా జరగటంతో ఆయన రియలైజ్ అయ్యారు. మన విషయంలో మూర్ఖంగా ప్రవర్తించానని ఫీలవుతున్నారు.''

''ఎంత అమాయకులండీ మీరు? ఆయన ఇప్పుడు రమ్మనేది మన మీద ప్రేమతో కాదు మీ అమ్మగారికి సేవ చేయటానికి ఎలాగూ ఆమెకి మనిషి సాయం కావాలి. మీ చెల్లెలికు పెళ్లి అయిపోయింది. ఇంక ఎవరు వచ్చి చేస్తారు? అందుకని ఇప్పుడు కోడలు కావల్సి వచ్చింది. నేను మాత్రం ఆ కొంపకి చస్తే రాను'' కోపంగా అంది లక్ష్మి.

చర్రున వచ్చిన కోపాన్ని కంట్రోలు చేసుకుంటూ ''సరే అలాగే అనుకుందాం. అయినా కన్నతల్లికి బాగోనప్పుడు కొడుకుగా నా ధర్మం నేను నిర్వర్తించాలిగా.''

''హా ధర్మం! మన పెళ్లి విషయంలో ఏమయింది ధర్మం. మా వాళ్లు అంటే వదిలేసుకున్నారు. ఇంటి కోడలిని అని వాళ్లయినా ఆదరించారా? నాతో మాట అలా ఉంచండి కనీసం మీతో అయినా కాంటాక్టు ఉన్నాయా? మిమ్మల్ని కూడా వదిలివేశారు. అలాంటప్పుడు ఏ ముఖం పెట్టుకొని వెళతాం? చెప్పండి'' ఉక్రోషంగా అంది.

''జరిగిపోయినవన్నీ ఇప్పుడెందుకు చెప్పు. ఆ పరిస్థితుల్లో ఎవరైనా ఎలా ప్రవర్తిస్తారో మా వాళ్లు,


మీ వాళ్లు కూడా అలాగే చేశారు. అలా అని ఎప్పటికి ఏకాకులుగా ఇలాగే మిగిలిపోవాలా? కోడలిగా కాకపోయినా సాటి మనిషిగా నీ వంతు సహాయం నువ్వు చేయి. నీ మంచి మనసు వాళ్లే తెలుసుకుంటారు'' అనునయంగా చెప్పాడు డేవిడ్.

''అవసరం లేదు. ఎవరి సర్టిఫికెట్స్ నాకు అక్కరలేదు. ఇన్ని సంవత్సరాలుగా మనం చచ్చామో, బ్రతికామో కూడా పట్టించుకోనప్పుడు అత్తమామలైనా, తల్లిదండ్రులైనా నాకు ఒకటే. అందరినీ కాదని నాలుగు జిల్లాలు దాటి మీతో వచ్చింది కేవలం మీ కోసమే. దయచేసి నన్ను ఇబ్బంది పెట్టకండి'' రెండు చేతులూ జోడించింది లక్ష్మి.

''అది కాదు లక్ష్మి నా మాట...''

''ప్లీజ్ డేవిడ్.. ఈ విషయంలో మీ మాట కాదంటున్నానని బాధ పడకండి. అర్థం చేసుకోండి. అక్కడ నేను ఇమడలేను. వెళ్లి బాధ పడే కన్నా అసలు వెళ్లకపోవటమే మంచిది. మీ మాట వినలేదని నన్ను అన్యాయం చేయరు కదూ'' కన్నీళ్లతో అడుగుతున్న ఆమెని చూసి గాఢంగా నిట్టూర్చాడు.

''ఛ.. ఛ.. ఏమిటిది? ఊరుకో. అందరినీ వదులుకొని పెళ్లిచేసుకుంది. నిన్ను ఏడిపించటానికా? నీకు ఇష్టం లేని పని ఏదీ చేయను సరేనా!'' అంటూ ఆమె కన్నీళ్లు తుడిచాడు. ఇంక ఆమెని ఎలా ఒదార్చాలో, ఏం చెప్పి ఒప్పించాలో అర్థం కాక తనే మనసు మార్చుకొంటుందిలే అని సరిపెట్టుకున్నాడు. తరువాత తను మాత్రం వారానికి, పది రోజులకి వెళ్లి తల్లిని చూసి వచ్చేవాడు. తరువాత తరువాత కచ్చితంగా ప్రతి శనివారం వెళ్లే వాడు. తిరిగి సోమవారం ఆఫీస్ టైంకి వచ్చేవాడు. ఎట్టి పరిస్థితిల్లోనూ వెళ్లకుండా ఉండేవాడు కాదు.



అతను వారం, వారం వెళ్లటం ఇష్టం లేకపోయినా తనని రమ్మనకుండా ఉంటే అంతే చాలు అనుకునేది లక్ష్మి. తన ఇంట్లో చక్కగా స్నానం, పూజ, శుచీ, శుభ్రతలతో పవిత్రమైన వాతావరణం ఉంటుంది. అది తన హిందూ మత గొప్పతనం. అక్కడికి వెళ్తే వాళ్ల పద్ధతులు తనకి గిట్టవు. భర్తతో అంటే ఎడ్జస్ట్ అవ్వచ్చు. అక్కడ అందరితో అంటే తను ఎడ్జస్ట్ అవ్వలేకపోవటమే కాక బాబుని కూడా అలాగే తయారుచేస్తారని లక్ష్మి భావన. కులం, మతం మాకు పట్టింపులు లేవు అని చాలామంది అంటూ ఉంటారు. కానీ మనం పుట్టిన కులం నుండి, మనం పెరుగుతున్న మతం నుండి కొన్ని అలవాట్లను, ఆహార నియమాలను నేర్చుకోవడంతో మన జీవన శైలి ఏర్పడుతుంది. మనం ఎంత పెద్దవాళ్లమైనా అలవాట్లన్నీ మానుకోవాలంటే చాలా కష్టపడాలి. అది కష్టమనిపించినపుడు తను తప్పు చేశానా? అనే అనుమానం వస్తుంది. ప్రస్తుతం లక్ష్మి పరిస్థితి అలానే ఉంది. కానీ ఆ తరువాత డేవిడ్ ఏనాడూ లక్ష్మిని తన వాళ్ల దగ్గరకి రమ్మనకపోవటంతో అతని మీద ఆమె పెంచుకున్న నమ్మకం మరింత పటిష్టంగా మారింది.

★ ★ ★

కూ..కూ అంటూ ట్రైన్ పెట్టిన కూతకి ఉలిక్కిపడి గతంలోంచి బయటపడింది లక్ష్మి. ఏదో స్టేషన్ వచ్చినట్లుంది. చీకటిలో కనబడటం లేదు. తల తిప్పిచూసింది డేవిడ్ బయటకి చూస్తున్నాడు. దాదాపు ఇరవై సంవత్సరాల తరువాత ఈ రోజు తనని... ''నాతో పాటు మా వూరికి వస్తావా లక్ష్మి''? అని అడిగాడు.

తను సమాధానం చెప్పేలోపే ''ప్లీజ్ ఈ ఒక్కసారి.. ఒకే ఒక్కసారి కాదనకు'' అర్థింపుగా అడిగాడు.

''ఎందుకు?'' అని తను అడగలేదు. అతను చెప్పలేదు. కానీ ఏదో బలమైన కారణం ఉండి ఉంటుంది. తినబోతూ రుచులెందుకు?

స్టేషన్‌లో ట్రైన్ ఆగటంతో- ఆమె ఆలోచనలకు కూడా బ్రేక్ పడింది. లగేజ్ తీసుకొని ఆటో ఎక్కారు. స్టేషన్ నుండి ఒక కిలోమీటరు ప్రయాణించాక ఊరి ఎంట్రెన్స్‌లో ఒక చర్చి, దాని పక్కనే పాత భవంతి. భవంతి ముందు ఆటో ఆగింది. వాడికి డబ్బులిచ్చి పంపించి లగేజ్ చేత్తో పట్టుకొని ''రా లక్ష్మి'' అంటూ లోపలకి దారి తీశాడు.

చుట్టూ ఆసక్తిగా చూస్తూ గేటు తీసుకొని లోపలకి ప్రవేశించింది. వరండా దాటి లోపలకి అడుగు పెట్టబోయి ఆగిపోయింది. మొదటి సారిగా అత్తగారింట అడుగు పెట్టబోతుంది. కొత్త కోడలిగా అడుగు పెట్టవలసిన తను ఇన్ని సంవత్సరాల తరువాత తనకి కోడలు వచ్చే వయసు వచ్చాక అత్తగారింట అడుగు పెట్టటం విచిత్రంగా అనిపించింది.

డేవిడ్ సరాసరి హాల్లో నుండి ఒక బెడ్‌రూంలోకి తీసుకెళ్లాడు. చేతిలో బ్యాగ్ కింద పెడుతూనే గబగబా వెళ్లి రూం బోల్టు వేసి కూర్చో లక్ష్మి అన్నాడు. ఎదురుగా మంచం మీద ఉన్న ఆమె ఎవరో అర్థం కాలేదు లక్ష్మికి. అత్తగారు అయి ఉండరు. ఎందుకంటే ఈమె తన ఈడుదే కానీ పేషెంట్‌లా ఉంది. అత్తగారు అయితే బాగా ముసలమ్మ అయి ఉండాలి.

''మేరీ, మేరీ'' అంటూ తట్టి లేపాడు. ఆమె కళ్లు విప్పి చూసింది. ''లక్ష్మిని తీసుకు వచ్చాను''.

ఆమె తల తిప్పి లక్ష్మి వైపు చూసి చిరునవ్వుతో కూర్చొని ఉన్న లక్ష్మిని దగ్గరగా రమ్మని చేయి ఊపింది. కుర్చీ దగ్గరగా లాక్కొంది లక్ష్మి. డేవిడ్ వచ్చి ఆమె పక్కనే మంచం మీద కూర్చుని ''లక్ష్మి కష్టం అయినా నిష్టూరం అయినా నేను చెప్పే విషయం దయచేసి ప్రశాంతంగా విను. ఈమె నా భార్య మేరీ'' అన్నాడు.

నెత్తిమీద బాంబ్ పడినట్లు నివ్వెరపోయింది లక్ష్మి. ఆమెకి మాట్లాడే చాన్స్ ఇవ్వకుండా అతను



## దూరం-భారం

**కొన్నిటికీ దూరంగా ఉంటే కొన్నాళ్ళపాటు బాగానే ఉంటుంది. కానీ అవకాశాలు మాత్రం భారమవుతాయి. అన్నట్టు అసలు సంగతి ఏమిటంటే ఎక్స్‌పోజింగ్‌కు ఎప్పుడూ సై అనే అందాలతార ప్రియాంకా చోప్రా ఇప్పుడు ఆ అంకం సమాప్తం అయిందంటోంది. 'నా అందాన్ని ఎరగా వేసి అవకాశాలు పొందడం నాకు అవసరం లేదు. ఎందుకంటే అందాలపోటీల్లో పాల్గొని వచ్చినదాన్ని. నాకు ఎలాంటి అందం ఉందో అందరికీ తెలుసు' అంటోంది.**

చెప్ప సాగాడు.

''నీకు గుర్తు ఉందా? అమ్మకి పెరాలిసిస్ వచ్చినప్పుడు మనం ఇక్కడికి వచ్చేద్దామని నేను ఎంత ప్రయత్నించినా నీవు ససేమిరా అన్నావు. ప్రేమించిన నిన్ను బాధ పెట్టలేక, అమ్మ అనారోగ్యం చూడలేక, పిల్లలమైన మనల్ని ఆదరించకపోవటమే కాకుండా ఇప్పటివరకు పట్టించుకోనందుకు ఆ ప్రభువు ఇలా శిక్ష వేశాడని, గిల్టీగా ఫీలవుతున్న నాన్నగార్ని సమాధానపరచలేక సతమతమవుతున్న నాకు నాన్నగారు హైదరాబాద్ వచ్చి కోడల్ని ఒప్పించి తీసుకు వద్దాం. నేను కూడా నీతో వస్తాను అని అనేసరికి 'ఏం అవసరం లేదు. మీ కోడలు రావటానికి సిద్ధంగా ఉంది' అని అబద్ధం ఆడి ఈసారి తప్పకుండా తీసుకువస్తానని ఎప్పటికప్పుడు చెబుతూ వాయిదాలు వేస్తూ నాన్నలో ఆశలు కల్పించాను. ఇక్కడికి నీవు ఎట్టి పరిస్థితిలో రావు అన్నది అర్థమయింది.

మా కంపెనీలో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తున్న మేరీ నాకు అప్పటికే ఆత్మీయురాలు. ఆ స్నేహంతోనే ఇంట్లో పరిస్థితి ఆమెకి చెప్పి బాధపడుతున్న నన్ను ఓదార్చి ఓ సలహా ఇచ్చింది. అదేమిటంటే 'మరో పెళ్లి చేసుకొని మీ నాన్నగార్కి కోడల్ని చూపించమని.' ఎలాగూ ఆయనకి లక్ష్మి ఎవరో తెలియదు కాబట్టి 'నో ప్రాబ్లెమ్' అంది మేరీ. కానీ నీకు అన్యాయం చేయటం ఇష్టం లేక చాలా రోజులు ఆ విషయం గురించి ఆలోచించలేదు. కానీ అక్కడ అమ్మ పరిస్థితి బాగోలేక, నాన్న గారి అవస్థ చూడలేక ఈ గండం గట్టెక్కాలంటే ఇక అంతకన్నా మార్గం లేదనిపించింది. లక్ష్మి హిందువు అని నాన్నగార్కి తెలుసు. మరి నేను వేరే అమ్మాయిని తీసుకెళితే ఆ అమ్మాయికి అన్యాయం చేస్తావా? మళ్లీ పెళ్లి చేసుకున్నావా? అనే సందేహం వస్తుంది నాన్నకు. ఇది జరిగేది కాదులే అని మేరీతో అన్నాను. 'మీకు అభ్యంతరం లేకపోతే మీ భార్య లక్ష్మిగా మీ పేరెంట్స్‌కి నేను సేవ చేస్తాను' అంది. గత్యంతరం లేని పరిస్థితిలో మేరీని చర్చిలో పెళ్లి చేసుకున్నాను. ఇంటికి తీసుకెళ్లి లక్ష్మిగా పరిచయం చేశాను. నాన్నగారు ఏమిటమ్మా నువ్వు బొట్టుపెట్టుకోలేదు? మా కోసం నీ సాంప్రదాయాన్ని వదులుకోనవసరం లేదు. మా ఇంట్లో మహాలక్ష్మిలా తిరుగుతూ కనబడాలి అన్నారు. ఆ రోజు నుండి మేరీ లక్ష్మిగా పేరు మార్చుకోవటమే కాక కట్టూ, బొట్టూ అన్నీ మార్చుకొని హిందువుగా మారిపోయింది.''

అప్పుడు గమనించింది లక్ష్మి, మేరీ నుదుటున ఉన్న బొట్టుని.

''వారానికి రెండే రోజులు శని, ఆదివారాలు మాత్రమే నేను వచ్చే వాడిని. అయినా చిరునవ్వుతో వారం అంతా ఎదురు చూసేది.''

అందుకన్నమాట ఎట్టి పరిస్థితులలోనూ అతను శని, ఆదివారాలు మిస్ అవ్వకుండా వచ్చేవాడు.

ఇరవై సంవత్సరాలుగా మంచంలో ఉన్న మా అమ్మని పసిబిడ్డలా కాపాడింది. ఎన్నో సేవలు చేసేది. అందుకే అమ్మ ఇంకా ఆయుష్షుతో ఆనందంగా ఉంది. నాన్నగారు- ఒంటరిగా అక్కడ నువ్వు ఎందుకు? ఇక్కడికి వచ్చేసి ఏదో ఒక జాబ్ కానీ, బిజినెస్ గానీ చూసుకోవచ్చు అని ఎన్నిసార్లు చెప్పినా ఎంతో నేర్పుగా సమాధానం చెప్పేది కానీ ఏనాడు నేను తనతో ఫుల్‌టైం గడపటం లేదని అందరి భార్యల్లా సతాయించేది కాదు.

నాకు తెలిసీ నిన్ను నేను అన్యాయం చేయలేదు. నా తల్లిదండ్రులకి న్యాయమే జరిగింది కానీ.. కానీ నాకు తెలిసి అన్యాయం జరిగింది మేరీకి. తన జీవితాన్ని నా కోసం పణంగా పెట్టిన ఆమెకి నాతోపాటు ఇప్పుడు ఆ దేవుడు కూడా అన్యాయం చేస్తున్నాడు. తనకి బ్లడ్ కేన్సర్. మూడు నెలలకి మించి బ్రతకదని డాక్టర్లు చెప్పారు. ఈ సంగతి అమ్మకి తప్ప అందరికీ తెలుసు. తను ఒక్కసారి నిన్ను చూడాలని కోరింది. అందుకే ఇక్కడికి తీసుకువచ్చాను'' రుద్ధమైన కంఠం సహకరించకపోవటంతో ఆగిపోయాడు డేవిడ్.

లక్ష్మికి ఇదంతా కలలా ఉంది. ఇంత జరిగినా తనకి తెలియకపోవడం మరింత ఆశ్చర్యంగా ఉంది. మేరీ, లక్ష్మి చేతిని తన చేతిలోకి తీసుకొని ''లక్ష్మి, ఆయన నాకు అన్యాయం జరిగిందని బాధపడుతున్నారు కానీ నిజానికి ఎక్కడో దిక్కు

లేని అనాథను సేల్స్‌గర్ల్‌గా ఇంటింటికి తిరిగి అమ్ముకొంటూ కేరాఫ్ ఫ్లాట్‌ఫారం అయిన నాకు ఇంతటి స్థానం కల్పించారు. నాకంటూ ఇల్లూ, బాధ్యతలు, బంధాలు ఏర్పరిచారు. నాకు ఇంతకన్నా ఇంకేం అదృష్టం అక్కర్లేదు. దీనికి పరోక్షంగా కారణం నీవే. నీకు ఎంతో ఋణపడి ఉన్నాను. నా కోరికల్లా ఒక్కటే. నా బిడ్డ రోజీ ఇప్పుడు టెన్త్ క్లాసు చదువుతోంది. నేను పోయాక అది వాళ్ల తాత, నాన్నమ్మలకి ఆధారం అవ్వాలి. కానీ రేపు ఎప్పుడో ఆ పండుటాకులు రాలిపోతే నా కూతురిగా కాకపోయినా కనీసం ఒక అనాథకు ఆశ్రయం ఇచ్చాను అనుకొని ఆదరించగలవా?'' ఆర్తిగా అడుగుతున్న మేరీ చేతిలో చెయ్యి వేస్తూ-

''నేనే నీకు ఋణపడి ఉన్నాను. అహంకారంతో ఆయన ఎంత నచ్చచెప్పినా ఈ ఇంటికి రానన్న నన్ను అందరి దృష్టిలో మంచిదాన్ని చేశావ్. నేనెవరో తెలియకపోయినా నా పాత్రలో పరకాయ ప్రవేశం చేసి నన్ను ఉత్తమురాల్ని చేశావు. నా గౌరవం నిలబెట్టావ్. దానికోసం నీ ఉనికినే కోల్పోయావు. ఇంత త్యాగాన్ని నేను భరించలేను. డేవిడ్‌తో పెళ్లికి ఉన్న తెగింపు అతని కుటుంబంతో కలిసి బ్రతకటానికి లేకుండా పోయింది. దానికి కారణం పెద్ద కులంలో పుట్టానని అహంకారం. గొప్ప మతంలో బ్రతుకుతున్నానని భ్రమ పడ్డాను. కానీ నీవు నీ భర్త కోసం నీది కాని మతాన్ని ఇన్ని సంవత్సరాలుగా ఆనందంగా స్వీకరించావు. నీ వాళ్లు సంతోషించటం కోసం నీది కాని జీవితాన్ని సునాయాసంగా నీ భుజాలకెత్తుకున్నావు. ఇంత చేసినా నీ చిన్న కోర్కెను తీర్చకపోతే నేను అసలు మనిషినే కాదు'' కన్నీళ్లతో అంది లక్ష్మి. ఇంతలో తలుపు చప్పుడు అవటంతో అందరూ మాటలాపేశారు. తలుపు తీయగానే డేవిడ్ తండ్రి పీటర్, పదిహేనేళ్ల రోజీ లోపలకి వచ్చారు. పీటర్ చేతిలో కొబ్బరి చిప్ప, అమ్మవారి కుంకుమ కోడలికిచ్చి ''అమ్మా లక్ష్మి ఇది అమ్మవారి కుంకుమ. మీ దేవుడైనా నీ మొర ఆలకిస్తాడేమోనని తెచ్చాను. తీసుకోమ్మా'' అన్నాడు.

''మామయ్యగారు.. మీరు గుడికి వెళ్లారా?'' కన్నీళ్లు బుగ్గలపై జారుతుండగా అడిగింది మేరీ.

''ఇంతకన్నా నేను చేయగలిగింది ఏముందమ్మా! నీ కన్నవాళ్లని కూడా నీవు చూడాలనుకోవటం లేదు. నీ ఆయువు తీరిపోతుందని తెలిసీ ఏమీ చేయలేని వాళ్లం. కనీసం నీకు మనశ్శాంతి అన్నా ప్రసాదించమని ప్రార్థించటానికి అమ్మవారి గుడికి వెళ్లాను'' అన్నాడు బాధగా.

''ఈమె నా చిన్ననాటి స్నేహితురాలు. నన్ను చూడటానికి వచ్చింది. నాకు చాలా సంతోషంగా ఉంది మామయ్యగారు'' అంది మేరీ.

అప్పుడు చూశాడు పీటర్ లక్ష్మివైపు. అప్రయత్నంగా అతని పాదాలకు నమస్కరించింది లక్ష్మి.

''గ్లాడ్ బ్లెస్ యూ మై చైల్డ్'' నిర్మలమైన చూపులతో అశీస్సులు అందిస్తున్న మామగారి మొఖం చూడలేక తలదించుకుంది లక్ష్మి.

తరువాత తల్లి గదిలోకి తీసుకెళ్లాడు డేవిడ్. కోడలి ఫ్రెండు అనేసరికి ఆవిడ ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. ఆ ఇంట్లో లక్ష్మిస్థానం ఏమిటో అర్థం అయింది కానీ ఆ లక్ష్మి తను కాదు. తాను ఎంత విలువైనదీ, తిరిగి పొందనిది పోగొట్టుకుందో కూడా అర్థమైంది.

''మేరీ ఇంక బయలుదేరుతాం.''

''చాలా సంతోషం లక్ష్మి. ఇంక నేను నిశ్చింతగా కళ్లు మూస్తాను. నేను పోయాక నా బిడ్డని ఓదారుస్తావు కదూ?'' అంటున్న మేరీ పెదవులు తన చేత్తో మూసి ''తప్పు, అలా మాట్లాడకు, నీకేం కాదు. నీవంటి ఉత్తమురాలు కడుపున పుట్టిన నీ కూతురికి ఏ కష్టం రాదు. ఇక నుంచి నాకు కొడుకుతోపాటు కూతురు కూడా ఉంది.'' అంటూ రోజీని ప్రేమగా దగ్గరికి తీసుకుంది.

ఇంటికి తిరిగి వస్తున్న లక్ష్మికి అర్థం కానిదొక్కటే తన మతమా? ఆమె మానవత్వమా? మేరీని బలి పశువుగా మార్చింది. ఏమో!


# ఉత్తర భారత యాత్రలు

| | | Frequency | Fare Rs. |
|---|---|---|---|
| 1. | Delhi-Vaishno Devi-Dalhousie-Amritsar-Kullu-Manali-Delhi. | Every Monday | 5,500/- |
| 2. | Delhi-Shimla-Kullu-Manali-Rohtang pass-Chandigarh-Kurukshetra-Delhi. | Every Friday | 4,000/- |
| 3. | Delhi-Jaipur-Agra-Mathura-Delhi *(By A/C Coach)* | Every Mon / Friday | 1,500/- |
| 4. | Delhi-Mussoorie-Haridwar- Rishikesh-Lakshman Jhoola-Delhi | Every Tue / Friday | 1,200/- |
| 5. | Delhi-Badrinath- Kedarnath-Delhi | Every Mon / Friday | 4,200/-* |
| 6. | Delhi-Badrinath-Kedarnath-Gangotri-Yamunotri-Delhi | Every Friday | 6,500/-* |

Fare includes twin sharing room accommodation for tour Nos.1 to 4 and four sharing room accommodation for tour Nos.5 & 6, transport and guide services. We are running L.F.C. / L.T.C. tours. All tours are by Super Deluxe buses, starting from our New Delhi Office. Contact our offices for advance reservations at : **Mumbai Ph:2432 6895, Chennai Ph: 2538 5253, Bangalore Ph:2226 2633, Vijayawada Ph : 257 6624, Vizag Ph: 254 1099.**

మీరు ఢిల్లీ వచ్చినపుడు అధునాతన సౌకర్యములతో నిర్మింపబడిన 100 రూములు గల హోటల్ సదరన్‌లో బస చేయండి. రుచికరమైన తెలుగు భోజనం మా హోటల్లోని అమరావతి/కామత్ రెస్టారెంట్లలో లభించును.

*Includes vegetarian food enroute

**HOTEL SOUTHERN :**

# SOUTHERN TRAVELS (P) LTD.

(Recognised by Ministry of Tourism, Govt. of India)
Serving since 34 years
ఢిల్లీలోని తెలుగువారి ప్రముఖ వాణిజ్య సంస్థ

**Head Office:** 18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi-110 005. Ph: 2573 9508, 2572 2210. Fax: 011-2575 1308. e-mail: southerntravelsindia@vsnl.com

No. 7, Mustafa Towers, Near Hotel Ayodhya, Lakdi-ka-pul, Hyderabad-500 004. Ph: 2330 3561, 2331 8866. Cell: 98490-03679. e-mail : hyd1_southhyd@sancharnet.in